సాక్షి తిరుపతి

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



ప్రతిష్టాత్మకం.. ఐఐటీ ప్రస్థానం.

తిరుపతి ఐఐటీ ప్రస్థానం.. అత్యంత ప్రతిష్టాత్మకమని డైరెక్టర్ డాక్టర్ కేఎన్.సత్యనారాయణ తెలిపారు. - 8లో



గదుల కేటాయింపునకు ప్రత్యేక యాప్

గదుల శుభ్రత, కేటాయింపులకు ప్రత్యేక యాప్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నట్టు టీటీడీ ఈఓ తెలిపారు. - 8లో



నీటి కోసం నిరసన

నీటి కోసం నిరసనకు దిగారు. కాలనీకి కరెంట్, నీటి సౌకర్యం కల్పించాలంటూ వెంకటగిరి మండల వాసులు డిమాండ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

స్వచ్ఛంద సంస్థలకు ఆహ్వానం

తిరుపతి అర్బన్: శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సూళ్లూరుపేట బాలసదన్ నిర్వహించడానికి గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంత బాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు ఆసక్తి ఉన్న వారు తమ అనుభవం ఉన్న వివరాలతోపాటు రిజిస్ట్రేషన్, మూడేళ్ల ఆడిట్ రిపోర్ట్‌తో తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో వివరాలను సమర్పించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

తిరుపతి ఎడ్యుకేషన్ : నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆరు వారాల స్పోర్ట్స్ కోచింగ్ సర్టిఫికెట్ కోర్సుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మే 6 నుంచి జూలై 2వ తేదీ వరకు ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, సైక్లింగ్, కెనోయింగ్ కయాకింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, హాకి, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఉషు, యోగా తదితర 29 క్రీడాంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ''డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.6 డబ్ల్యూసీసీ.ఎన్ఎస్ఎన్ఐఎస్.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు చిత్తూరు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సంబంధిత యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఎస్జీటీ, ల్యాంగ్వేజ్ పండిట్, పీఈటీలు సీనియారిటీ జాబితాలు ప్రచురించామన్నారు. సెకండ్‌గ్రేడ్, ఈక్వలెంట్ క్యాడర్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సంబంధిత కేడర్‌ల టీచర్లు www.chittoordeo.com వెబ్‌సైట్‌లో ఉన్న సీనియారిటీ జాబితాలను పరిశీలించుకోవాలన్నారు. ఆ జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలున్నట్‌లైతే ఈ నెల 5 నుంచి ఈ నెల 11వ తేదీలోపు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తగు ఆధారాలతో వినతిపత్రం అందజేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోబోమని డీఈఓ స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,864 మంది స్వామివారిని దర్శించుకోగా 25,764 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.51 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.



కూటమి పాలనలో చావే శరణ్యం అంటూ ఉరి వేసుకుంటున్న రైతు

మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

కూటమి అధినేతల మాస్క్‌లతో వైఎస్సార్‌సీపీ నేతలు

కూటమికి షాక్!

పూర్వకాలంలో వీధి నాటకాలు, బుర్రకథల ద్వారా ప్రజలను చైతన్య పరిచేవారు. నేడు అదే తరహాలో కూటమి నేతల నయవంచనలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ నేతలు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వినాయకసాగర్ పార్క్‌లో 'విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుదాం' పేరుతో వీధినాటకాన్ని ప్రదర్శించారు. కాల'కూటమి' విషంపై ప్రజలను చైతన్యపరిచారు.

- విద్యుత్ చార్జీలు పెంచేది లేదని ఎన్నికల ముందు ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే ప్రజలపై పెనుభారాలు
- వీధి నాటకంతో ప్రజలను చైతన్యపరచిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- దోపిడీకి గుణపాఠం తప్పదంటూ నినాదాలు

కూటమి హామీలు అంతా బూటకాలేనంటూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వీధి నాటకం రక్తికట్టించింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు యచ్చం వాసుయాదవ్, పసుపులేటి సురేష్ రాయల్, హరిబాబు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు మాస్కులు ధరించి తమదైన శైలిలో నటించి ప్రజలను చైతన్యపరిచారు. దీన్ని సోషల్ మీడియా యాక్టివిస్టులు ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తున్నారు. ఆ వీధి నాటకం ఎలా సాగిందో చూద్దాం రండి.. **–సాక్షి ప్రతినిధి, తిరుపతి**

భూమన అభినయ్

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా తిరుపతిలో 'విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుదాం' అనే వీధి నాటకాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజలందరికీ చంద్రబాబు ఎలాంటివారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అబద్ధానికి ఆయన బ్రాండ్ అంబాసిడర్. అసత్యాన్నే పలుకవలెను అంటూ అధికారంలోకి వచ్చారు. ఐదేళ్లు కరెంటు చార్జీలు పెంచనని చెప్పి ఐదు నెలలకే జనానికి షాక్ ఇచ్చారు. సూపర్ సిక్స్ అనే దొంగ హామీలతో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చారు.

ఆ ముగ్గురే వచ్చి మాట్లాడితే ఇలా ఉంటుందా?

అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మధ్య జరిగే సంభాషణను ముగ్గురు వైఎస్సార్‌సీపీ నాయకులు రక్తికట్టించారు.

బాబు వేషంలో వాసుయాదవ్

చూసినారు కదా అది అప్పుడు, ఇప్పుడు ఆ మాదిరి జనం నెత్తిన కరెంటు చార్జీలు మోపి మనం ముందరికి పోదాం.

పవన్ వేషంలో పసుపులేటి సురేష్ :

కానీ మనం చార్జీలు పెంచమని చెప్పాం కదా బాబు గారు?

బాబు వేషధారి:

ఇదిగో పవన్ కళ్యాణ్ నీకు అధికారం కొత్త, ఇంకా అలవాటు పడాలి. గెలిచే వరకు జనాలపై మమకారం చూపించాలి. గెలిచాక కఠిక కారం తినిపించాలి. ఇదే నా పాలసీ. చెప్పిన అబద్ధం చెప్పకుండా చెప్పి జనాల్ని నమ్మించాలి. తరువాత మనం ఏం చెప్పినామో మనమే మరిచిపోవాలి. నీకు తెలుసో తెలియదో.. నిజం నా ఇజం కాదు ఒకవేళ నిజం చెబితే నా తల వేయి వక్కలవుతుందని నాకు శాపం ఉంది తెలుసా?

పవన్ వేషధారి:

నిజమా బాబు గారు.. అందుకే నేను మీ శిష్యరికంలోకి వచ్చాను

బాబు వేషధారి:

వస్తే వచ్చినావు కానీ గురువుకి నామం పెట్టొద్దు

పవన్ వేషధారి:

అయ్యా ఎంత మాట అసలునా చిన్నప్పుడు గురువుల్ని..

బాబు వేషధారి:

నువ్వు ఒక్కడివి ఏం మాట్లాడినా చైల్డ్ హుడ్‌కి లాగుతావు. సెల్ఫ్ తగ్గించి సెల్ఫిష్ నేర్చుకో

పవన్ వేషధారి:


చార్జీలు పెంచితే జనం ఊరికే ఉంటారా?

బాబు వేషధారి:

ఊరుకోక ఏం చేస్తారు. మూడు సార్లు ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసినా.. నేను సంపద సృష్టిస్తా అంటే నమ్మి ఓట్లు వేశారు కదా. వీళ్లకు మించి అమాయకులు ఉంటారా. 100 అబద్ధాలు చెప్పి పెళ్లి చేస్తారో లేదో తెలియదు కానీ నేను మాత్రం వెయ్యి అబద్ధాలు చెప్పినా అధికారంలోకి రావాలని నమ్ముతాను.

భూమన అభినయ్:

చూశారుగా చంద్రబాబు గారు అంటే ఏంటో.. ఇచ్చిన మాట మీద ఉండరు. కుర్చీ ఎక్కినాక మడత పెట్టి జనాన్ని తంతాడు.



విద్యుత్ చార్జీల భారంపై ప్రజలు ఏమంటున్నారో విందాం రండి

సాధారణ గృహిణి

తల్లికి వందనం అంటే వంచన అని తెలుసుకున్నాం. ప్రతి బిడ్డకీ రూ.15 వేలు అంటే.. అరచేతిలో స్వర్గమని అర్థమైంది. జగనన్న ఉండి ఉంటే జూన్‌లోనే డబ్బులు పడేవి. చంద్రబాబు పథకాలు ఇస్తానని చెవిలో పువ్వు పెట్టాడు. కరెంటు చార్జీలు పెంచి వైర్లలో షాక్ ఇస్తున్నాడు ఈ చంద్రన్న. అప్పులు చేసి కరెంటు బిల్లు కడుతున్నాం. చెప్తుండా వినండి చంద్రన్న ఎప్పుడొచ్చినా జనాలకి షాక్ ట్రీట్మెంట్ తప్పదు.

భూమన అభినయ్ :

బాబు గారి హయాంలో వ్యాపారస్తుడి బాధ ఎలా ఉందో చూద్దాం రండి..

వ్యాపారి:

బాబన్న వస్తే జేబు అంతా ఖాళీ. రూ.1,500 బిల్లు వచ్చేది. ఇప్పుడు అదే బిల్లు రూ.15 వేలయ్యింది. దేవుడికే నామం పెట్టే నారావారి పాలన.. జనం నమ్మకానికి అవహేళన.

అభినయ్:

రైతు దేశానికి వెన్నెముక అంటారు మరి కూటమి ప్రభుత్వంలో రైతు ఎంత దీనంగా ఉన్నాడో చూద్దాం రండి..

రైతు:

'పెట్టుబడి సాయం ఇస్తానని రైతులకి పంగనామాలు పెడుతున్నాడు. స్మార్ట్ మీటర్ల పేరుతో చావబాదుతున్నాడు. ఆయనకి పవర్ వచ్చిందంటే మనకి పవర్ బిల్లు పెరిగిందని అర్థం ..' అంటూ రైతు వేషధారి ఉరితాడు తగిలించుకుని రైతు ఆత్మహత్యల గురించి రైతు వేషధారణలోని పాపిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నం చేశారు.



కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలి - ఓ సాధారణ గృహిణి చంద్రబాబు పాలనపై ప్రశ్నలు

అభినయ్:

కూటమి అంటేనే జనాలకి కాలకూట విషం. మోసం, ద్రోహం. ఇదంతా పోవాలి, మార్పు రావాలి. దీనికి మనం ఏం చేయాలంటే.. ప్రజల్లో తిరుగుబాటును తీసుకురావాలి.

జనం: పెంచిన విద్యుత్ చార్జీల బిల్లును తగలబెడదాం. 2029 నాటికి ఈ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం.



పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు



మళ్లీ నువ్వే రావాలి: సీఎం పీఠంపై వైఎస్ జగన్

2029 ఎన్నికల ఫలితాలు ఇలా ఉంటాయి..

అభినయ్:

నమ్మకం అంటే జగన్.. సంక్షేమం అంటే జగన్. 2029 ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయం.. అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉద్ఘాటించారు. కష్టాలు ఎక్కువ రోజులు ఉండవు.. కూటమికి రోజులు దగ్గరపడ్డాయి. వచ్చేది.. గెలిచేది మనమే.. జై జగన్...జైజై జగన్ అంటూ వీధినాటకానికి ముగింపు పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాత్రను బిరుదాల కౌశిక్‌రెడ్డి పోషించారు. నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, సాయికుమారి, తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు, ఐరగం అనిల్‌రెడ్డి, బత్తల గీతాయాదవ్, మద్దాలి శేఖర్‌రాయల్, బత్తల అరుణ్ యాదవ్, కోటి, పునీత, సాత్విక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర పూజలు



ఊరందూరుకు బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపచేశారు. అనంతరం ఊరేగింపుగా మండలంలోని ఊరందూరు నీలకంఠేశ్వరాలయానికి వేంచేశారు. అక్కడ పూజల అనంతరం తిరిగి పానగల్, అగ్రహారం, సన్నిధివీధి, నాలుగు మాడవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు.

'అల'జడి



తీరంలో అలల తాకిడికి బోటును ఒడ్డుకు లాగుతున్న మత్స్యకారులు

వాకాడు: తీరంలో అలజడి ఏర్పడింది. చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాల సముద్ర తీరంలో భిన్నవాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. గత వారం రోజులుగా మత్స్యకారులు అలల తాకిడికి సముద్రంలో వేట చేయలేకపోతున్నారు. ఆటుపోట్లు ఒక్కో సమయంలో ఒక్కో రకంగా మారుతున్నాయి. బోట్లు, వలలు ఒక్క చోట నిలవక బోల్తా పడుతున్నాయి.

ప్రాధాన్యం ఎక్కడ?

- వరి రైతు విలవిల
- గిట్టుబాటు ధరలేక అవస్థలు
- ఊసేలేని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

రేణిగుంట: వరి రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. పంటకు గిట్టుబాటు ధరలేక..పెట్టుబడీ చేతికందక విలవిల్లాడుతున్నాడు. గత ఏడాది 80 కిలోల బస్తా రూ.2,300 పలికింది. అదే బస్తా నేడు రూ.1,500 నుంచి రూ.1,600 కూడా పలకకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. గతంలో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలకు జిల్లా నుంచి ఎక్కువగా వరి ధాన్యం తరలించేవారు. అయితే ప్రస్తుతం ఆంక్షలు కఠినతరం చేయడంతో మిల్లర్లు, దళారులు ధర అమాంతం తగ్గించేశారు.

తగ్గిన దిగుబడి

జిల్లాలో ఈ రబీలో 1,82,790 ఎకరాలలో వరిసాగు చేశారు. ఇప్పటికే సగానికిపైగా పంట నూర్పిడి పనులు పూర్తయ్యాయి. తూర్పు మండలాల్లోనే ఎక్కువగా వరి సాగైంది. సీజన్ ప్రారంభంలో ఎడతెరిపి లేని వర్షాలు, వెన్ను దశలో మంచుతీవ్రత కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 45 బస్తాలు రావాల్సిన దిగుబడి 30 బస్తాలకు పడిపోయింది.

సవాలక్ష ఆంక్షలు

ప్రభుత్వం 75 కిలోల ఏగ్రేడ్ వరి ధాన్యం రూ.1,700కు కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల గురించి సరైన అవగాహన లేకపోవడానికితోడు తేమశాతం, కేడి ధాన్యం, చెత్తాచెదారం వంటి ఆంక్షలు పెట్టడంతో రైతులు విధిలేక ప్రయివేటు మిల్లర్లు, దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



శ్రీకాళహస్తి: కళ్లాల్లోనే వరి ధాన్యం



పొలాల్లోనే ఆరబెట్టిన వరి ధాన్యం

ఏపీ సీడ్స్‌లో మరో రకంగా

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) శ్రీకాళహస్తి కేంద్రంలో మేలిరకపు విత్తనాలను ప్రతియేటా సేకరిస్తున్నారు. ఈ సారి ఏపీ సీడ్స్‌లో దీర్ఘకాలిక రకాలైన వరి ధాన్యం క్వింటాల్ రూ.2,900, స్వల్పకాలిక రకాలు రూ.2,450 వరకు ధర నిర్ణయించి సేకరిస్తున్నారు. ఇక్కడికి తీసుకొచ్చే ధాన్యం మళ్లీ రైతులకు విత్తనాలుగా అందిస్తున్న నేపథ్యంలో సేకరించే ధాన్యంలో ఏ మాత్రం నాణ్యత తక్కువైనా తిప్పి పంపేస్తున్నారు. నాణ్యత కోసం ల్యాబ్‌కు పంపి, అక్కడ ఆమోదం పొందితేనే రైతుల నుంచి ధాన్యం సేకరిస్తారు. దీంతో చాలా మంది రైతులు ఏపీ సీడ్స్‌కు తాము పండించిన ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి విక్రయం కోసం నిరీక్షిస్తున్నారు. ధాన్యం తీసుకున్న 20రోజుల్లోపు నగదును రైతుల ఖాతాలకు జమ చేస్తున్నారు.

వరిధాన్యం కొను'గోల్‌మాల్'!

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈ సారి సుమారుగా 5,65,000 మెట్రిక్ టన్నుల దిగుబడి రానుంది. అయితే ఫిబ్రవరి మొదటి వారంలో వరి ధాన్యం కొనుగోలును ప్రారంభించిన సివిల్ సప్లయ్ అధికారులు మార్చి 31తో ముగించారు. ఈ రెండు నెలల వ్యవధిలో 65వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన 5,00,000 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని రైతులు దళారీ సహకారంలో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా ఏప్రిల్ 30వ తేదీ వరకు వరి ఒబ్బిళ్లు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. అయితే మార్చి 31తోనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేయడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చాలా దుర్మార్గం



నాకు ఐదెకరాల పొలం ఉంది. గత ఏడాది రూ.2,300కు బస్తా వరిధాన్యం అమ్మాను. ఈ సారి దానికంటే ఎక్కువ ధర లభిస్తుందన్న ఆశపడ్డాను. కానీ ఈ సారి దిగుబడి తగ్గింది. ఎకరాకు 27 బస్తాలయ్యాయి. కోతయంత్రానికి గంటకు రూ.2,400 ఇచ్చి కోయించాను. తీరా మూడు రోజులు ఎండబెట్టి అమ్మేసరికి బస్తా రూ.1,600కు కూడా అడిగేవారే కరువయ్యారు.

– నాదముని, రైతు, చెర్లోపల్లి, శ్రీకాళహస్తి మండలం

80శాతం ఒబ్బిళ్లు పూర్తి



జిల్లాలో మార్చి 31కి 80శాతం పంట ఒబ్బిళ్లు పూర్తి చేశారు. మరో 20శాతం పంట మాత్రమే ఒబ్బిళ్లు చేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ 30కి 100శాతం పంట ఒబ్బిళ్లు పూర్తి అవుతుందని అంచనాలు వేస్తున్నాం. ఆ తర్వాత ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్లుప్తంగా

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: దివ్యాంగులకు కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సహకరిస్తామని యూత్ పోర్‌జాబ్స్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు సలీమ్, సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రధానంగా పదోతరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ చదువుకున్న 19–34 ఏళ్ల వారు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత సర్టిఫికేట్స్‌తో ఈ నెల 7వ తేదీలోపు తిరుపతిలోని భవానీ నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని యూత్ పోర్ జాబ్స్ ఫౌండేషన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9347411952, 7702020490 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన ఫిజియోథెరపీ వర్క్‌షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు

తిరుపతి తుడా: స్విమ్స్ వర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రిగ్గర్ పాయింట్ థెరపీ ఫర్ మైయోఫేషియల్ పెయిన్ అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు సినర్జీ, ఫిజియోకేర్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఫౌండర్ డాక్టర్ సురేష్ ఫ్రాంకిన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మైయో ఫేషియల్ చికిత్సపై ప్రసంగించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

చంద్రగిరి: మృతుడి ఆచూకీ లభించినట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు. మండల పరిధిలో నిరసింగాపురం రైల్వేగేటు సమీపంలో గురువారం ఓ వ్యక్తి మృతి చెందిన విషయం విధితమే. మృతుడు చిత్తూరు జిల్లా, గుడిపాల మండలానికి చెందిన మణి(62)గా గుర్తించినట్లు తెలిపారు.

ప్రతిష్టాత్మకం.. ఐఐటీ ప్రస్థానం

- మరో పదేళ్లలో మొదటి తరం ఐఐటీగా గుర్తింపు
- 10వ వ్యవస్థాపక దినోత్సవంలో డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ



చక్రవర్తిని సత్కరిస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు (రేణిగుంట): తిరుపతి ఐఐటీ రానున్న పదేళ్లలో మొదటి తరం(ఫస్ట్ జనరేషన్) ఐఐటీగా అవతరించబోతోందని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో శుక్రవారం 10వ వ్యస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కంపెనీ వ్యవస్థాపకులు ఆర్వీ చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ పదేళ్ల తిరుపతి ఐఐటీ ప్రస్థానం ఎంతో ప్రతిష్టాత్మకంగా సాగిందన్నారు. ఐఐటీ శాశ్వత భవనంలోకి మారేందుకు పదేళ్లు పట్టిందని గుర్తుచేశారు. విద్యార్థులు శాశ్వత భవనంలో చదువుకునే అవకాశాన్ని కల్పించాలన్న సంకల్పంతో తాను కేంద్ర విద్యాశాఖ బృందాన్ని ఒప్పించి సౌత్‌జోన్ క్యాంపస్ నిర్మాణాన్ని పూర్తి చేసుకుని 2018 కల్లా శాశ్వత క్యాంపస్‌లోకి చేరుకున్నట్టు తెలిపారు. ఇక్కడ 548 ఎకరాల్లో తాము అంతర్జాతీయ స్థాయి టెక్నాలజీతో కూడిన వసతులను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఐఐటీ ప్రాంగణంలో ఫేజ్– ఏ నిర్మాణాలను 2023 అక్టోబర్ కల్లా పూర్తి చేశామన్నారు. సెంట్రల్ లైబ్రరీ, నాలెడ్జ్ సెంటర్, 800 మంది సామర్థ్యంతో ఆడిటోరియం, హెల్త్ సెంటర్ నిర్మాణాలను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వివరించారు. మే 11న టెక్నాలజీ డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి ఐఐటీని సందర్శించనున్నట్లు తెలిపారు. జూలై 20న ఐఐటీ స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వ్యవస్థాపకులు చక్రవర్తి మాట్లాడుతూ కోర్ ఇంజినీరింగ్ కోర్సులైన మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ వంటి కోర్సులు చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

స్లాట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం



రిజిస్ట్రేషన్లకు వచ్చిన క్రయవిక్రయదారులు

తిరుపతి అర్బన్: జిల్లా కేంద్రమైన తిరుపతి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పైలెట్ ప్రాజెక్టుగా శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో 17 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా.. ఇందులో తిరుమలలో మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఆస్తుల క్రయవిక్రయాలు మిగిలిన 16 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతిలో మాత్రమే స్లాట్ రిజిస్ట్రేషన్లు చేపట్టారు. వారం రోజుల తర్వాత జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ రిజిస్ట్రేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాగా తొలి రోజు అయిన శుక్రవారం తిరుపతిలో 22 స్లాట్స్ మాత్రమే బుక్ అయ్యాయి.

రిజిస్ట్రేషన్ విభాగానికి తగ్గిన రాబడి

గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు రాబడిపై లెక్కలను వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 16 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.782.68 కోట్ల మేర ప్రభుత్వం టార్గెట్ విధించగా.. అందులో రూ.696.58 కోట్ల వరకు వచ్చినట్టు అధికారులు వివరించారు. తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.153.77 కోట్లతో ప్రథమ స్థానంలో ఉండగా.. చిన్నగొట్టిగల్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రూ.5.54 కోట్లతో చివరి స్థానంలో నిలిచింది.

> **త్వరలో జిల్లా అంతటా స్లాట్ రిజిస్ట్రేషన్లు**
> జిల్లా వ్యాప్తంగా 16 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ రిజిస్ట్రేషన్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. జిల్లా కేంద్రమైన తిరుపతిలో శుక్రవారం స్లాట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం. 2025–26 ప్రణాళిక ప్రకారం ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తాం.
> –శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్



స్విమ్స్‌కి జాతీయ హోదా ఇవ్వండి

- పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి డిమాండ్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: రాయలసీమ ప్రజలకు ఎనలేని సేవలందిస్తున్న తిరుపతి స్విమ్స్ ఇన్‌స్టిట్యూట్‌ని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా పరిగణించాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేస్తుందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ఎంపీ లేవనెత్తారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా గుర్తింపు పొందడానికి అవసరమైన అర్హత ప్రమాణాలు, గత దేళ్లలో ఇలా గుర్తింపు పొందిన ఆరోగ్య సంస్థల జాబితా వివరాలు తెలపాలని కోరారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి గుర్తింపు కోసం ప్రభుత్వానికి ఏవైనా ప్రతిపాదనలు అందాయా? అని ఎంపీ ప్రశ్నించారు. జాతీయ ప్రాముఖ్యత హోదా కలిగిన సంస్థగా ప్రకటించవచ్చని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్‌జాదవ్ పేర్కొన్నారు. తిరుపతి స్విమ్స్‌కు జాతీయ ప్రాముఖ్యత హోదా గుర్తింపు కోసం ప్రతిపాదనలు అందాయని, కానీ స్విమ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా స్థాపించిన సంస్థ అని, ఈ హోదా కోసం పార్లమెంటులో చట్టం చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు.

ఐదుగురు క్షేత్రసహాయకుల తొలగింపు



చిట్టమూరు : గ్రామాల్లో జరిగిన పనులను వివరిస్తున్న డీఆర్పీలు

చిట్టమూరు : మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై కూటమి కర్కశంగా వ్యవహరిస్తోంది. తాజాగా ఐదుగురు క్షేత్ర సహాయకులపై వేటు వేసింది. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 23 పంచాయతీలలో గత ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను తనిఖీలు నిర్వహించి డీఆర్పీలు అవకతవకలను చదివి వినిపించారు. ఇందులో మస్టర్లు సక్రమంగా లేవనే సాకుతో మల్లాం, యాకసిరి, ఆలేటిపాడు, మొలకలపూడి, యాకసిరి, ఆరూరు పంచాయతీల క్షేత్ర సహాయకులను తొలగిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మండలంలో రూ.లక్ష రికిరీకి ఆదేశించినట్టు పేర్కొన్నారు. అనంతరం డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ పేద వాడి కష్టం విలువ తెలిసిన వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నామన్నారు. విధుల పట్ల అలసత్వం వహించినా, కూలీల పట్ల తమ ప్రవర్తన సక్రమంగా లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనికి వచ్చిన ప్రతి కూలీకి రూ.300 దినసరి కూలి వచ్చేలా పని చూపించాలన్నారు. ఏపీడీ వరప్రసాద్, విజిలెన్స్ అధికారి గణేష్, ఎంపీడీఓ మనోహర్‌గౌడ్, ఏపీఓ శీలా పాల్గొన్నారు.

రూ.5.1 లక్షలు రికవరీ

ఓజిలి: ఉపాధి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బందిపై డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ చర్యలు చేపట్టారు. మండల ఏపీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. 26 పంచాయతీలలో 2024–25కుగాను రూ.14.2 కోట్లతో ఉపాధిహామీ, పంచాయతీరాజ్ పనులు చేశారు. ఈ పనులకు సంబంధించి నిధులు సక్రమంగా ఖర్చు చేయకపోవడంతో సిబ్బంది నుంచి రూ.5.1 లక్షలు రికవరీకి ఆదేశించారు. అలాగే వెంకటరెడ్డిపాళెం, ఆర్మేనిపాడు గ్రామాలకు చెందిన క్షేత్రసహాయకులు నిధులను దుర్వినియోగం చేశారని విధులు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా టీఏ మహేష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను అందజేశారు. దీంతోపాటుగా టీఏపై ఏపీడీఓ విచారణకు ఆదేశించారు.

SRI VENKATESWARA UNIVERSITY
TIRUPATI
e-Procurement Short Tender Notice
Tender No.23/UEO-HD/ SVU/ TPT/2024-25, Date:04/04/2025
For details log on to https://www.tender.apeprocurement.gov.in and Tender Schedule Download Ending and Bid Submission Closing Date: 19.04.2025 at 09.30A.M & 10.30A.M from Nit No.179 to184.
Sd/- M.Bhupathi Naidu, Registrar
S.V.University, Tirupati.

TIRUPATI URBAN DEVELOPMENT AUTHORITY: TIRUPATI

Roc.No.1869/G1/2023 Date:04-04-2025

PUBLIC NOTICE

TUDA has proposed to issue Transferable Development Rights (TDRs) for the affected lands in TUDA master plan roads.

DETAILS OF THE TDR APPLICATIONS:

Sl. No.	Name of the affected land owner applied for TDR	Location of the affected site	Master plan road width	
			Existing	Proposed
1.	Sri Thella Bathini Babu with Registered ID.No.3557	Sy.No.110/2A1 of Mangalam Village, Settipalli GP, Tirupati Urban Mandal.	80'	150'
2.	Sri V. Lakshmaiah with Registered ID No. 3558	Sy.No.110/2A1 of Mangalam Village, Settipalli GP., Tirupati Urban Mandal.	80'	150'
3.	Smt M. Bhudevi with Registered ID No. 3350	Sy.No.57/10E of Mangalam Village, Settipalli, Tirupati Urban Mandal	NA	80' & 60'

The list of TDR applications is putup for public notification calling for objections and suggestions from general public. Public shall submit objections and Suggestions along with relevant documents to claim the same within 7 days from the date of this publication to the Vice Chairman, TUDA, failing which it will be construed that there are no objections/ suggestions and the above proposals will be processed as per rules in force.

Sd/-Smt.N.MOURYA, IAS, Vice-Chairman , TUDA, Tirupati

పరిశోధనలతోనే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న జోహార్ సింగ్

నారాయణవనం: వృత్తి విద్యను అభ్యసిస్తున్న యువ ఇంజినీర్లు వినూత్న పరిశోధనలతోనే గుర్తింపును పొందుతారని పలువురు పేర్కొన్నారు. స్థానిక పుత్తూరు సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియంను నిర్వహించారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 1,200 మంది యువ ఇంజినీర్లు 400 పరిశోధనాత్మక పత్రాలను సమర్పించారు. బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ గ్రూప్‌కు చెందిన చీఫ్ ఇంజినీర్ జోహార్ సింగ్, తిరుపతికి చెందిన ఇండో ఎంఐఎం లిమిటెడ్ హెచ్‌ఆర్ కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరిశోధనలతో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు మాట్లాడుతూ టెక్నికల్ ఇన్‌ఫోయిజంలను వేదికగా చేసుకుని యువ ఇంజినీర్లు తమ సాంకేతిక పరిజ్ఞాన్ని పెంచుకోవాలని తెలిపారు. పవర్ పాయింట్, పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి ముగ్గురు విజేతలకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లతోపాటు నగదు బహుమతిని అందజేశారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

గదుల కేటాయింపునకు ప్రత్యేక యాప్

తిరుపతి కల్చరల్: గదుల శుభ్రత, కేటాయింపులకు ప్రత్యేక యాప్ తీసుకురానున్నట్టు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాలు సంతృప్తికరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ తిరుమలలోని పలు ప్రాంతాలు, కాటేజీలలో పరిశుభ్రతను పెంచేందుకు సిబ్బందికి ప్రత్యేకంగా యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. టీటీడీ వసతి గదుల కేటాయింపుపై సమగ్ర సమాచారం తెలిసేలా సిబ్బందికి యాప్ రూపొందించాలన్నారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వి.వీరబ్రహ్మం, ఇన్‌చార్జ్ సీవీఎస్‌వో వి.హర్షవర్ధన్ రాజు, టీటీడీ సీఈ టీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు



దీపం-2 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు

తిరుపతి అర్బన్: అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని సివిల్ సప్లయ్ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆయన తిరుపతి కృష్ణానగర్‌లో దీపం -2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ రెండో సిలిండర్ బుకింగ్ చేసుకునే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి, చంద్రగిరి, కోడూరు ఎమ్మెల్యేలు, జనసేన నేతలు, అధికారులు హాజరయ్యారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు రెండో సిలిండర్ బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తున్న కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ శివకుమార్ కథనం.. 2020 జనవరి 24వ తేదీ తిరుపతి టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది కరకంబాడి అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో నిందితులు ప్రకాశం జిల్లా, గిద్దలూరు మండలం, ఓబులాపురానికి చెందిన సీ.వెంకటరమణ, కర్నూలుకు చెందిన పీ.మహబూబ్‌బాషా మరో ముగ్గురు కలిసి 103 కిలోల ఐదు ఎర్రచందనం దుంగలను నరికి, తరలిస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. వీరిలో ఒకరు కేసు విచారణ దశలో మృతి చెందారు. మరొకరు కేసు విచారణకు హాజరు కాకపోవడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం నిందితులు వెంకటరమణ, మహబూబ్ బాషా, వైఎస్‌ఆర్ జిల్లాకు చెందిన రవి పై కేసు విచారణ జరిగింది. నేరం వెంకటరమణ, మహబూబ్ బాషాపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రవిపై నేరం రుజువు కాకపోవడంతో అతనిపై కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శివకుమార్ (ఫైల్)

నారాయణవనం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి గాయాలతో ఆస్పత్రి పాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుని భార్య హంస ఫిర్యాదు మేరకు వివరాలు.. పుతూరు ఎన్‌జీవో కాలనీలో పెయింటర్ శివకుమార్(45) నివాసముంటున్నాడు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నారాయణవనం మండలం వైకుంఠపురంలోని స్నేహితుడు యువరాజ్‌ని కలిసేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో స్కూటర్‌పై మరో స్నేహితుడు జనార్దన్‌తో కలిసి వైకుంఠపురానికి బయలుదేరాడు. జాతీయ రహదారి నారాయణవనం బైపాస్ రోడ్డులో హైలెవల్ బ్రిడ్జికి చేరుకున్న వీరి స్కూటర్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బ్రిడ్జిపై నుంచి స్కూటర్ కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో శివకుమార్ మృతి చెందగా జనార్దన్ గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చస్తున్నట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఎనిమిది మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెంట్ ఎన్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణయ్య (ఫైల్)

బాలాయపల్లి(సైదాపురం) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన బాలాయపల్లి మండలం కోడంబేడులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోపి కథనం.. కోటంబేడు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య(50) కొద్ది రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఆయన మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం కోడంబేడు సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువ సమీపంలో గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సారా నిర్మూలనకు నవోదయ 2.0



మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్

తిరుపతి క్రైం: సారా నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. తిరుపతి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధ్యాత్మిక జిల్లాలో సారా నిర్మూలించడంలో నవోదయ 2.0 కార్యక్రమాన్ని దశల వారీగా అమలు చేయాలన్నారు. ప్రత్యేకంగా గంజాయిని సమూలంగా నిర్మూలించడానికి దృష్టి పెట్టాలని సూచించారు. కల్తీ మద్యం విషయంలోనూ సీరియస్‌గా వ్యవహరించాలని చెప్పారు. చిత్తూరు డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసాచారి, బాలకృష్ణన్, తిరుపతి, చిత్తూరు జిల్లాల సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవచౌదరి పాల్గొన్నారు.

నీటి కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీతారాం ఏచూరి కాలనీ వాసులు

తిరుపతి అర్బన్: తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ వెంటగిరి మండలం, పెట్లూరు గ్రామం సీతారాం ఏచూరి నగర్ వాసులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌కు చేరుకుని తమ ఆవేదన వెళ్లగక్కారు. కాలనీకి తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేదని వాపోయారు. తమ కాలనీ అభివృద్ధికి అటవీశాఖ అధికారులు అడ్డుగా నిలుస్తున్నారని ఆరోపించారు. వారికి సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజుతోపాటు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి మునిరాజ, రమణయ్య తదితరులు అండగా నిలిశారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

నాగఫణిశర్మ.. తెలుగు జాతి ఆణిముత్యం



పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మను సత్కరిస్తున్న అతిథులు, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మను పద్మశ్రీ వరించడం తెలుగుజాతికి గర్వకారణమని, ఆయన తెలుగు ప్రజల ఆణిముత్యమని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీలో శుక్రవారం ద్విసహస్రావధాని పద్మశ్రీ మాడుగుల నాగ ఫణి శర్మను వర్సిటీ అధికారులతో కలసి ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు ఈఓ మాట్లాడుతూ జాతీయ సంస్కృత విద్యాపీఠం పూర్వ విద్యార్థి మాడుగుల నాగఫణి శర్మకు ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ వరించడం అదృష్టమని, ఆయన నేటి యువతకు ఆదర్శనీయులన్నారు. అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడారు.

విద్యాపీఠం విద్యార్థిగా గర్వపడుతున్నా

జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యనభ్యసించడం అదృష్టంగా భావిస్తున్నాని పద్మశ్రీ మాడుగుల నాగ ఫణిశర్మ అన్నారు. వర్సిటీ తనను సత్కరించడం విద్యాపీఠం విద్యార్థిగా గర్వపడుతునాని తెలిపారు. వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, విశ్రాంత ఆచార్యులు కొంపెల్ల రామ సూర్యనారాయణ, మాజీ వీసీ రాళ్లపల్లి రామూర్తి, స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, ఎన్ఎస్‌యూ రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, అధ్యాపకులు డాక్టర్ నల్లన్న, సత్యనారాయణ, శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ పాల్గొన్నారు

సప్తగిరి గ్రామీణ బ్యాంకు
(ప్రభుత్వ రంగ సంస్థ : ఇండియన్ బ్యాంకు చే ప్రాయోజితం) HO- చిత్తూరు
మంగళంపేట శాఖ, పులిచెర్ల మండలం, చిత్తూరు జిల్లా.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

[illegible]

"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" "ఎక్కడ ఏమి ఉన్నది అక్కడ అలానే" ప్రాతిపదికన వేలము ద్వారా తేది.15-05-2025 న విక్రయింపబడు నిర్ణయింపబడినది.

[illegible]

1) శ్రీ కె.రాధాకృష్ణయ్య లేటు (మరణించిన ఋణగ్రహీత & తనఖాదారు) ప్రాతినిధ్యం వహిస్తున్న చట్టబద్ధమైన వారసుడు అయిన వారి కుమారుడు శ్రీ కె.లక్ష్మీపతి రాజా వీధి, మంగళంపేట (గ్రామం & పోస్టు), పులిచెర్ల ఆర్‌ఎం, చిత్తూరు జిల్లా-517 172
2) శ్రీ కె.లక్ష్మీపతి (ఋణగ్రహీత & తనఖాదారు), తండ్రి: లేటు కె.రాధాకృష్ణయ్య రాజా వీధి, మంగళంపేట (గ్రామం & పోస్టు), పులిచెర్ల ఆర్‌ఎం, చిత్తూరు జిల్లా-517 172
3) శ్రీ ఎస్.నాగరాజ ప్రసాద్ (హామీదారు), తండ్రి: మునిరత్నం రాజా వీధి, మంగళంపేట (గ్రామం & పోస్టు), పులిచెర్ల ఆర్‌ఎం, చిత్తూరు జిల్లా-517 172

విషయం: సప్తగిరి గ్రామీణ బ్యాంక్, మంగళంపేట బ్రాంచ్‌లో గల లేటు కె.రాధాకృష్ణయ్య మరియు శ్రీ కె.లక్ష్మీపతి గారి లోన్ అకౌంట్ నెం.91200106 గురించి

తేది.04-04-2025 నాటికి బకాయి రూ.4,31,811/- మరియు తేది.05-04-2025 నుండి వర్తించు వడ్డీ, కాస్ట్లు, ఇతర ఛార్జీలు మరియు ఖర్చులు.

డిమాండ్ నోటీసు తేది: 13-11-2017 స్వాధీనపు తేది: 15-02-2018

ఆస్తి వివరములు : [illegible] సర్వే నెం.194/7 లో ఎ.0.06 [illegible] ఆస్తి యజమానులు: లేటు కె.రాధాకృష్ణయ్య మరియు శ్రీ కె.లక్ష్మీపతి

రిజర్వ్ ధర: రూ.11,64,000/-	ధరావతు: రూ.1,16,000/-	తెలిసిన బకాయిలు : లేవు

వేలం తేది, సమయము & ప్రదేశము: తేది.15-05-2025 (గురువారం), [illegible] సప్తగిరి గ్రామీణ బ్యాంక్, రీజనల్ ఆఫీస్, [illegible]

బిడ్లను సమర్పించుటకు చివరి తేది : 15-05-2025, (గురువారం) & మధ్యాహ్నం గం.3-00 వరకు

వివరముల కొరకు బ్యాంకు వెబ్‌సైట్ www.saptagirigrameenabank.in చూడగలరు. [illegible] 1. బ్రాంచ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, మంగళంపేట బ్రాంచ్ వద్ద, 2. ఏజిఎమ్ / చీఫ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, హెడ్ ఆఫీస్, చిత్తూరు వద్ద 3. రీజనల్ ఆఫీస్ - సప్తగిరి గ్రామీణ బ్యాంక్-తిరుపతి వద్ద [illegible] బ్రాంచ్ మేనేజర్, మంగళంపేట బ్రాంచ్, సెల్: 88866 44120 & 88866 44208 వారిని సంప్రదించగలరు.

ప్రదేశం: తిరుపతి, తేది: 04-04-2025 సం/- అధీకృత అధికారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్